www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 8 ఆగస్టు 2023

5

చిత్తూరు



చేనేత రంగం అభివృద్ధి కోసమే 'నేతన్న నేస్తం'

కూడళ్లలో చేనేత రంగ వస్త్ర ప్రదర్శన స్టాల్ ఏర్పాటు: కలెక్టర్



చేనేత వస్త్రాల స్టాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగం అభివృద్ధి కోసం ఎంతగానో కషి చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ప్రాంగణంలో ఆప్కో వారు ఏర్పాటు చేసిన స్టాల్‌ను జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ దుస్తులను పరిశీలించి అమ్మకాలు గురించి ప్రశ్నించారు. అనంతరం చేనేత రంగానికి చెందిన పలువురు నాయకులు అధికారులతో కలిసి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం డిఆర్డిఏ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన దేశప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగానికి సంబంధించి లైవ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ చేనేతకు ఉన్న ప్రాముఖ్యత చాలా గొప్పదని, విదేశీ వస్తువులను బహిష్కరించేందుకు 1905లో చేనేత ఉద్యమం మొదలైందని, విదేశీ వస్తువులను బహిష్కరించడంతోపాటు భారత స్వాతంత్ర సమరంలో ఇది ప్రధాన భూమిక పోషించిందని అన్నారు. భారతదేశ స్వాతంత్రానికి ప్రధాన భూమిక వహించిన ఈ చేనేత రంగంకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2015 నుంచి తిరిగి ప్రాధాన్యత కల్పించడం జరిగిందని అప్పటినుంచి చేనేత దినోత్సవం నిర్వహించడం జరుగుతోందని అన్నారు. ఈ రంగం అభివద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం అనే కార్యక్రమం చేపట్టి అర్హులైన నేతన్నలకు ఒక్కొక్కరికి రూ.24వేలు సంవత్సరానికి ఇవ్వడం జరుగుతుందని, అదేవిధంగా ఈ రంగంలో పనిచేస్తున్న 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్ ఇవ్వడం జరుగుతోందని అన్నారు. హ్యాండ్లూమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో ఈ రంగం అభివద్ధికి కషి చేస్తున్నాయని చిత్తూరు జిల్లాలో 10 సంఘాలు ఉన్నాయని ఇటీవల పెనుమూరుకు చెందిన ఒక సంఘానికి 1.16 కోట్లు యంత్రాల కోసం ఇవ్వడం జరిగిందన్నారు. ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 3302 మందికి పింఛన్లు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. మరి కొంతమందికి త్వరలో మగ్గాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల చేనేత సంఘాల ప్రెసిడెంట్ పండరీనాథ్, సెక్రటరీ షణ్ముఖ వర్మ, డిసిసిబి మాజీ డైరెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించండి

సమీప ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని సంప్రదించండి : కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: దేశంలో పోలియో లేకుండా చేయాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని సత్యనారాయణపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నగర పాలకసంస్థ కమిషనర్ డాక్టర్ జె.అరుణ, ఇంచార్జి డిఎంఅండ్ హెచ్ఓ వెంకటప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, మేయర్ అముద, 9వవార్డు కౌన్సిలర్ భాగ్యలక్ష్మిలతో కలసి ఇంద్ర ధనుస్సు కార్యక్రమామ ద్వారా 0 – 2 సంవత్సరం లోపు పిల్లలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో పోలియో లేకుండా పూర్తిగా నిర్మూలించాలన్నదే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి తల్లిదండ్రులు అప్పుడే పుట్టిబిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా వివిధ రకాల టీకాలు వేయించాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సకాలంలో టీకాలు వేయించుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తిని పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అన్నిరకాల టీకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇంచార్జి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలోని ఇంటింటికీ వెళ్లి సర్వే చేయడం ద్వారా 901 మంది గర్భవతులు, 0 – 2 సంవత్సరాలు, 1971 మంది పిల్లలు, 2–5 సంవత్సరం 1255 మంది పిల్లలను గుర్తించడం జరిగిందని వీరి అందరికి టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడత ఆగస్టు 7 నుండి 11 వరకు, రెండో విడత సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు మూడవ విడత అక్టోబర్ 9 నుండి14 వరకు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిల నందు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు. డాక్టర్ల రవిరాజు, జార్జి, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ

కలెక్టరేట్ ఎదుట వీఆర్ఏల దీక్షలు



కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షల్లో వీఆర్ఏలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వీఆర్ఏల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వీఆర్ఏల సంఘం నేతృత్వంలో గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ దీక్షలకు జిల్లా నుండి పెద్దసంఖ్యలో వీఆర్ఏలు దీక్షల్లో పాల్గొన్నారు. వీఆర్ఏల దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగారాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. వీఆర్ఏల న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందుకు జగన్ ఇచ్చిన హామీ మేరకు వీఆర్ఏలకు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించడంతో పాటు అర్హత ఉన్న వారికి వీఆర్ఓలు పదోన్నతులు కల్పించాలని కోరారు. వీఆర్ఏల దీక్షలను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన జగన్ ప్రభుత్వం ఒక్కహామీని కూడా నెరవేర్చలేదన్నారు. చాలీచాలనీ జీతాలతో క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖలో కీలకంగా పనిచేస్తున్న వీఆర్ఏల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందిచి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో కనీస వేతనాల అమలు, నామినీలను వీఆర్ఏలుగా గుర్తింపు వంటి ప్రధాన సమస్యలతో పాటు టిఏ, డిఏలు పెంపు వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మండల కేంద్రాల్లో దీక్షలు, కలెక్టర్ దీక్షలు విజయవంతం చేసిన వీఆర్ఏలు ఈనెల 23,24వ తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి దీక్షలు, 25న జనన్నకు నేరుగా చెబుద్దాం ఛలో విజయవాడను విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం జిల్లా అధ్యక్షులు కోదండన్ మాట్లాడుతూ వీఆర్ఏలు పరిష్కరించాలటూ తాడోపేతో తెచ్చుకొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. జిల్లాలోని వీఆర్ఏలు ఛలో విజయవాడను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వీఆర్ఏల సంఘం నాయకులతో పాటు జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన వీఆర్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పకడ్బందీగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో 26 మండలాలలో 3 సర్పంచ్, 46 వార్డుసభ్యుల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడం జరిగిందనిజాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి మూడు సర్పంచుల స్థానాలు (జీడీనెల్లూరు మండలం నెల్లేపల్లి, విజయపురం మండలం కాళికాపురం, కార్వేటినగరం మండలం కత్తెరపల్లి) స్థానానికి, 46 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికకు సంబంధించి ఈనెల 8 నుండి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కలదని, 10వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. అలాగే నామినేషన్ల పరిశీలన 11వ తేదీ, నామినేషన్ల తిరస్కరణ, అప్పీళ్లు 12వ తేదీ ఆర్‌డిఓ వద్ద జరుగునని, అప్పీళ్లు పరిష్కారం 13వ తేదీ, ఉపసంహరణ 14వ తేదీ (మధ్యాహ్నం 3 గంటల లోపు) పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను 14వ తేదీ ప్రచురణ చేయడం జరుగుతుందని, ఈనెల 19న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగిన అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఈనెల 19వ తేదీ జరుగునని తెలిపారు. ఈ ప్రక్రియలో సర్పంచ్ ఎన్నిక, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగు గ్రామ పంచాయతీలలో ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఆన్‌లైన్లో 'స్పందన' వినతుల నమోదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో అందే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పరిష్కరించిన వినతులకు సంబంధించి సరైన రిపోర్టులు అప్లోడ్ చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులు స్పందన వినతులపై క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో రెవెన్యూ 3, ఇంజనీరింగ్ 2, టీపీవో 2, ప్రధాన కార్యాలయం 1 చొప్పున మొత్తం 8 వినతులు అందాయి. ఈకార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా కట్టమంచి చెరువు: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కట్టమంచి చెరువుకట్ట ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు పక్కనున్న మురుగునీటి కాలువను పరిశీలించారు. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ప్రాంతంలో క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. వారంలో రెండు రోజులు గ్యాంగ్ వర్క్ నిర్వహించి చెరువు కట్టను శుభ్రంగా ఉంచాలన్నారు. వాకింగ్ ట్రాక్ పక్కనున్న లైట్లు వెలిగేలా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు పక్కనున్న మురుగునీటి కాలువను పరిశీలించి, పూడిక తీయాలని ఆదేశించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ నరసింహ పాల్గొన్నారు.

ప్రజాకవి గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- పలమనేరు: ప్రజాకవి, రచయిత, పాటల యుద్ధనౌక గద్దర్‌కు పలమనేర్ పట్టణంలో సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా జాతీయ మానవహక్కులు అధ్యక్ష



కార్యదర్శులు డివి మునిరత్నం, వేలాయుధం, చంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల రాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ గుప్తా, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మహిళా అధ్యక్షురాలు మునెమ్మ, భువనేశ్వరి పాల్గొని మాట్లాడారు. గద్దర్ మృతి దేశానికే తీరని లోటని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ గమనంలో పెట్టుకుని ముందుకు సాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు సోము, పార్థసారథి, పాకాల సుబ్రహ్మణ్యం, మణి, హరి, సరస్వతి పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని మహాసముద్రం, కొరివారిపల్లెలో గ్రామంలో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర జానపద కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి బంగారు మురళి, రమేష్, తదితరులు పాల్గొన్నారు

నగరి: ప్రజాయుద్ధనౌక గద్దర్‌కు దళిత సంఘాల నాయకులు, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సోమవారం బస్టాండు ప్రాంగణంలోని అంబేద్దర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. ఆల్ ఇండియ అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ఎంకె. ప్రకాష్, కార్యదర్శి డి.గోవింద్‌స్వామి, మాజీ వైస్‌చైర్మన్ బాబు, అంబేద్కర్ సంఘ నాయకులు, బాలవర్ధన్ రాజు, గజేంద్ర, మల్లికార్జున, కుమార్, రవి సందీప్, ఉమాపతి, తంగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎలక్ట్రోల్స్ మంగళవారానికి పూర్తి చేయాలి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎలక్ట్రోలకు సంబంధించి మంగళవారం సాయంత్రం నాటికి పూర్తిచేయాలి జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి ఎలక్ట్రోలకు సంబంధించి తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఎలక్ట్రోలకు సంబంధించి మ్యాన్‌వల్ మంగళవారం సాయంత్రం కల్లా పూర్తి చేయాలన్నారు. యాప్ ద్వారా పదో తేదీ సాయంత్రం కల్లా పూర్తిచేయాలని సంబందితా అధికారులను ఆదేశించారు. బిఎల్ఓ ఇంటింటికి వెళ్లి జాగ్రత్తగా ఎలాంటి కంప్లైంట్స్ లేకుండా పరిశీలించి పూర్తి చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. సచివాలయం, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో నిర్వహించే ఆటల పోటీలకు అవసరమైన ఆట స్థలాలను గుర్తించి అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. సెక్రటరీలు, ఎంపిడిఓలు, ఎంఈఓలు, పీఈటీలు సమన్వయం చేసుకొని పనిచేయాలని జెసి ఆదేశించారు. 17 సంవత్సరాల పైబడిన వారందరూ కూడా ఈ ఆటల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈఆటలు 5 స్థాయిలలో సచివాలయ, మండల నియోజకవర్గ, జిల్లా స్థాయి లోను మరియు రాష్ట్ర స్థాయిలో నిర్వహించబడతాయని తెలిపారు.

పర్మినెంట్ చేయకుంటే సమ్మెలోకి...

- విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ హెచ్చరిక
- మాజీ ఎంపి మధు సహా 26 మంది అరెస్టు, విడుదల
- లాఠీఛార్జీ చేసి చెదరగొట్టే ప్రయత్నంలో పోలీసులు విఫలం
- తిరుపతి డిస్కం ఎదుట కార్మికుల మహాధర్నా సక్సెస్





వేలాదిగా పాల్గొన్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు , మాజీ ఎంపి మధును అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

'నెలలు కాదు... సంవత్సరాలు కాదు... నాలుగేళ్లు చూశాం.. మీ నిర్లక్ష్యాన్ని ఇంకా సహించలేం.. సహనానికీ ఓ హద్దు ఉంటుంది.. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని, కనీస వేతనం ఇస్తామని మీరే చెప్పారు.. తీరా దశలవారీ ఆందోళనలు చేసినా, అర్జీలు ఇచ్చినా ఫలితం లేకపోయింది.. సోమవారం డిస్కం పరిధిలో భారీ ధర్నాకు పిలుపునిస్తే కార్మికులను భయపెట్టి చెదరగొట్టాలని చూశారు.. సాధ్యం కాలేదు.. పర్మినెంట్ చేసి కనీస వేతనం ఇవ్వకుంటే ఈనెల 10 నుంచి సమ్మెలోకి వెళతాం' అని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ హెచ్చరించింది. కదం తొక్కిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతో తిరుపతి లక్ష్మీపురం సర్కిల్ రణరంగంగా మారింది.. సిపిఎం మాజీ ఎంపి పెనుమల్లి మధు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి సహా 26 మందిని అరెస్టు చేసి, అనంతరం విడుదల చేశారు. ఉద్యమాన్ని చెదరగొట్టేందుకు కార్మికులపై లాఠీఛార్జి చేయడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి.

సిఎం హామీ మేరకు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, 45 శాతం ఫిట్మెంట్, మూడు వెయిటేజీలతో కూడిన పిఆర్‌సిని శాశ్వత ఉద్యోగులకు ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, కారుణ్యనియామకాల్లో అడ్డగోలు నిబంధనలను రద్దు చేయాలని, 2022 ఆధారంగా పిఆర్‌సి వేతనాలు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యుత్ కార్మికులు మహాధర్నా చేపట్టారు. డిస్కం పరిధిలోని జిల్లాల నుంచి వేలాదిమంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తిరుపతికి చేరుకున్నారు. ధర్నాను విఫలం చేయడానికి పోలీసులు ఆదివారం సాయంత్రం నుంచే కార్మికులను అరెస్టులు చేయడం, నిర్బంధంలోకి తీసుకోవడం, నోటీసులు ఇవ్వడం, కార్యక్రమానికి రావద్దంటూ బెదిరించడం చేస్తూ వచ్చారు. ఇవేమీ లక్ష్యపెట్టని కార్మికులు పెద్ద సంఖ్యలో తిరుపతి పట్టణానికి చేరుకున్నారు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద కనబడిన విద్యుత్ కార్మికులందరినీ ఉదయం నుంచే అరెస్టులు చేయడం ప్రారంభించారు. విద్యుత్ కార్మికులకు మద్దతు ప్రకటించడానికి విచ్చేసిన సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మదు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, తిరుపతి నగర కార్యదర్శి వేణుగోపాల్‌లను లక్ష్మీపురం సర్కిల్ పెట్రోల్ బంక్ వద్ద అదుపులోకి తీసుకోడానికి ప్రయత్నించారు. బలవంతంగా నేతలను అరెస్టు చేసి ఈస్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో కార్మికులు ఆగ్రహంతో లక్ష్మీపురం సర్కిల్ వద్దకు ఎర్రజెండాలతో చేరుకున్నారు. పదుల సంఖ్యలో ఉన్న పోలీసులు వేల సంఖ్యలో ఉన్న కార్మికులను కట్టడి చేయలేక చేతులెత్తేశారు. లాఠీఛార్జీ చేయడానికి ప్రయత్నించినా కార్మికులను నిలువరించలేకపోయారు. వేలాదిగా వచ్చిన కార్మికులు ప్రదర్శనగా ఎస్‌పిడిసిఎల్ కార్యాలయం వద్దకు భారీ ప్రదర్శనగా విచ్చేశారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా సాగింది.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల పోరాట కమిటీ చైర్మన్ సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ పోలీసులు చేసిన ఓవరాక్షన్ అప్రజాస్వామికంగా ఉందని ఆయన విమర్శించారు. పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలు ఆగిపోవడానికి ఇది బోగస్ జేఏసీ కాదని... పోరాట కమిటీ అని ఆయన అన్నారు. కమిటీ కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ తక్షణం రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల్ని పరిష్కరించకుంటే ఆగస్టు పది నుంచి నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. తాము చేపట్టబోయే నిరోధక సమ్మె కారణంగా విద్యుత్ వినియోగదారులకు అసౌకర్యం కలిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బాలకాశి, కట్టా నాగరాజు, గంగయ్య, చంద్రశేఖర్, డిస్కం స్థాయి నేతలు ఎన్ శివశంకర్, బ్రహ్మానందరెడ్డి, రామలింగారెడ్డి తదితరులతోపాటు నాయబ్ రసూల్, శ్రీనివాసులు, కిరణ్ మణి, టి.కుమార్ పాల్గొన్నారు.

అప్రజాస్వామిక విధానాలు విడనాడాలి: మాజీ ఎంపీ మధు

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలుపరచకుండా జాప్యం చేయడమే కాకుండా హామీలను అమలు చేయమన్న నేరానికి కార్మికులపై నిర్బంధానికి పాల్పడడం, సంఘీభావం తెలియజేయాలని వచ్చిన తమలాంటి వాళ్ళను అరెస్టులు చేసి గంటల తరబడి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం దారుణమని విమర్శించారు తూర్పు పోలీస్ స్టేషన్లో తమతో పాటు 26 మంది కార్మికులు అరెస్టయ్యారని తెలిపారు. తక్షణం నిర్బంధాన్ని మానుకొని విద్యుత్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు మధు, కందారపు మురళిలతో పాటు పలువురు కార్మికులను నిర్బంధించారు. విద్యుత్ కార్మికుల పోరాటానికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకష్ణ, సిఐటియ జిల్లా నేతలు టి. సుబ్రమణ్యం, వేణుగోపాల్, రామకష్ణ తదితర నేతలతో కలిసి ధర్నాలో పాల్గొని మద్దతు ప్రకటించారు.

అధికారులతో చర్చలు జరిపిన విద్యుత్ నేతలు

ధర్నా సందర్భంగా డిస్కం అధికారులు పోరాట కమిటీ నేతలను ఆహ్వానించి చర్చలు జరిపారు. కమిటీ ప్రతిపాదిస్తున్న పలు అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తామని అధికారులు వెల్లడించారు. అనంతరం విద్యుత్ పోరాట కమిటీ నేతలు ధర్నాను విరమించారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యపై కలెక్టర్ హామీ

అర్హత ఉన్న వాళ్లకు రెండో దశలో అక్రిడేషన్ మంజూరు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితవిద్యను అందించడానికి కలెక్టర్ సగిలి షన్మోహన్ హామీ ఇచ్చారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లోకనాథన్, అశోక్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జిల్లా విద్యాశాఖ అధికారిని పిలిపించి మాట్లాడి దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే జిల్లాలో పలువురు జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయకపోవడంపై కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఈవారంలో రెండో దశ అక్రిడేషన్ కమిటీ సమావేశం నిర్వహించి, అందరికీ కార్డులు అందచేస్తామని అన్నారు. ఎన్నికల విధులను నిర్వర్తించే పాత్రికేయులకు సైతం పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలని కోరగా, దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చిత్తూరు ప్రెస్‌క్లబ్ కోశాధికారి పవన్, ఉపాధ్యక్షులు మహేష్, సీనియర్ పాత్రికేయులు సుభాష్‌బాబు, శ్రీనివాసమూర్తి, రమేష్‌బాబు, శివకుమార్, యాదవేంద్రరెడ్డి, చంద్రప్రకాష్, మస్తాన్ తదితరులు ఉన్నారు.



స్పందనకు 229 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 229 అర్జీలు రాగా ఇందులో శాఖలవారీగా అర్జీల వివరాలు రెవెన్యూశాఖకు సంబంధించి 164, జిల్లా ఎండోమెంట్ 1, జిల్లా పంచాయతీరాజ్ శాఖ1, మండల ప్రజాపరిషత్ 4, డిఎంహెచ్ఓ 1, నగర పాలకసంస్థ 2, పోలీసుశాఖ 1, సర్వేశాఖ 2, జిల్లా రిజిస్టర్ 1, రవాణా శాఖ 1, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ 1, ఎపిఐఐసి శాఖ 1, జిల్లా హౌసింగ్‌శాఖ 4, పెన్షన్, రేషన్ కార్డులు ఇతరులు 45 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓకు తమ వినతులను అందజేశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా జిల్లా అధికారులను ఆదేశించారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఏ.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంచాలకులు గిరిజన సంక్షేమశాఖ విజయవాడ వారి ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీ బుధవారం ఉదయం 10.30గంటలకు జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న డిఆర్డీఏ సమావేశం హాల్‌లో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లాలోని గిరిజన ప్రజా ప్రతినిధులు, గిరిజన ప్రభుత్వ ఉద్యోగస్తులు గిరిజన సంఘ నాయకులు, గిరిజన ప్రజలు విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆదరించండి


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటే గౌడ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఆమోదం ఉన్న సంక్షేమ పథకాల అమలు చేస్తూ ప్రజా పరిపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే వెంకటే గౌడ అన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని బట్టందొడ్డి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో స్థానిక సర్పంచ్ అర్చన పద్మనాథ్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. దాసార్లపల్లి, కుర్వల్లి, బనకందొడ్డి, బట్టందొడ్డి, అండిగానిపల్లి, కొత్తూరు గ్రామాల్లో ఇళ్ల వద్దకు వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. గ్రామాల్లో ఏ గడపకు వెళ్లినా ప్రజల సంతోషంతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారని ఆయన అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల అమలుతో నిరుపేదల జీవితాలు ఆర్థికంగా మెరుగుపడ్డాయి అని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే విధానం కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరిస్తూ మార్గదర్శకాలు రూపొందిస్తుందన్నారు. అర్హత ఉండి ఎవరికైన సంక్షేమ ఫలాలు అందకపోతే తెలియచేయాలని స్థానిక ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సభ్యురాలు సుష్మా కీర్తి, వైసీపీ మండల కన్వీనర్ భాగరెడ్డి, స్థానిక నాయకులు సింగిల్ విండో మాజీ ఛైర్మన్ శంకరప్ప, వైస్ ఎంపీపీ జి.డి బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన దృశ్యం

ప్రజాశక్తి-పలమనేరు: రూరల్ మండలంలోని కూర్మాయి ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరం ఆధ్వర్యంలో కెబి స్వచ్ఛంద సంస్థ వారు విద్యార్థులకు రక్త పరీక్షలు సోమవారం నిర్వహించారు. అలాగే పాఠశాలకు అవసరమైన మరమ్మతులు, విద్యార్థులకు గుర్తింపు కార్డులు, మొక్కలు నాటేటంకార్యక్రమాలను వారు నిర్వహించారు. అనంతరం కెబి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు భానుప్రకాష్‌కు మండల విద్యాశాఖ అధికారులు సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెంగమ్మ, జగన్మోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం, సిఆర్‌పి లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో బడుగు వర్గాలకు సంక్షేమం


సైకిల్ యాత్రలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: రాష్ట్రంలో టీడీపీ పాలనలోనే బడుగు వర్గాల ప్రజలకు సంక్షేమం అందుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, గాజుల ఖాదర్ బాషా, మునిరత్నం, చంద్రబాబు నాయుడు కార్యదర్శి మనోహర్, మునస్వామి, అనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రామమూర్తి పేర్కొన్నారు. సోమవారం పెద్దూరు, నారాయణ పురం, వీర్లమల, గుట్టురు తండాలలో టిడిపి యువ సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎంలు ఎన్టీఆర్, చంద్రబాబుల ఆధ్వర్యంలోనే బడుగు వర్గాల ప్రజలు సంక్షేమ బాటలో పయనించారు అని తెలిపారు. అనాదిగా ఎస్టీ, ఎస్సీ, బీసీ లు ఉంటున్న గ్రామాల్లో వసతులు మెరుగుపడక ప్రజలు అవస్థల్లో బతికారన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాలకు తారు రోడ్లు, సీసీ రోడ్లు, రక్షిత మంచినీటి పథకాలు, పాటశాలలు నిర్మాణం, పక్కా ఇళ్ల నిర్మాణం, పేదలకు బియ్యం పంపిణీ చేశారని తెలిపారు. కార్యక్రమంలో త్రిలోక్, సత్యేంద్ర శేకర్, విశ్వనాథ్ నాయుడు, జేయి, భూపతి, మనోహర్, గజేంద్ర, శంకర్ చలం పాల్గొన్నారు.

కనులవిందుగా కల్యాణం


స్వామి వారి కల్యాణ మహోత్సవ దృశ్యం

ప్రజాశక్తి-సోమల: ఆడి కృత్తిక మహోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన సోమల సమీపంలోని బంగారు తిరుత్తని వద్ద సోమవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు శ్రీ వల్లి సమేత సుబ్రమణ్య స్వామి కల్యాణ మహోత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం నుండి స్వామివారి ఆలయం వద్ద అర్చకులు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం ప్రత్యేక హోమాలు నిర్వహించి, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై సోమల పురవీధులలో ఊరేగించగా భక్తులు కర్పూర హారతులను అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-నగరి: నగరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బిఎన్ సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరలో సీఐగా ఉన్న శ్రీనివాసంతి బదిలీపై నగరి రూరల్ స్టేషన్ నింద్రకు వెళ్లడంతో వాయల్పాడు నుంచి బదిలీపై బిఎన్ సురేష్ విచ్చేశారు. సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించి, ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ నియంత్రణలో ప్రజల సహకారం అవసరమన్నారు. నగరి పట్టణం తమిళనాడు సరిహద్దులో ఉన్నందున అక్కడి నుంచి ఇక్కడకు విచ్చేసి నేరాలకు పాల్పడే వారిపైన ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్ సమస్యలు పరిష్కరించాలి


సిడిపివోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు టిహెచ్ఆర్ అమలు చేయడానికి కొత్తగా తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ గుప్తా డిమాండ్ చేశారు. అందులో భాగంగా సోమవారం ఐసిడిఎస్ కార్యాలయంలోని సిడిపివోకు ఆయన అంగన్‌వాడీ యూనియన్ నాయకులతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 2వ తేదీ నుండి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలులో భాగంగా గర్భిణులు, బాలింతలకు టిహెచ్ఆర్ ఇవ్వాలని నిర్ణయించారని తెలిపారు. పారదర్శకత పెంచాలని ఎవరు ఇస్తున్నారు, ఎవరు తీసుకుంటున్నారో తెలుసుకోవడానికి అంగన్‌వాడీలతో పాటు గర్భిణులు, బాలింతలు ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు ఎక్కువ ప్రాంతాల్లో పనిచేయట్లేదని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సిగ్నల్స్ ఉండట్లేదని, గర్భిణులు, బాలింతలు ఒకరోజు వచ్చి ఫుడ్ ప్యాకెట్లు తీసుకోలేని పరిస్థితి ఉందని తెలిపారు. కొంతమందికి అనారోగ్య సమస్యలు, బెడ్ రెస్టులో ఉండటంతో ఫుడ్ ప్యాకెట్లు కుటుంబ సభ్యులకు ఇచ్చేవారని, ప్రస్తుతం ఇది సాధ్యం కాదని తెలియజేశారు. ఫోన్లు పనిచేయకపోయినా నమోదుకు టార్గెట్ ఉండటంతో అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురిఅవుతున్నారని వాపోయారు. ఎటువంటి ట్రైనింగ్ లేకుండానే రకరకాల యాప్‌లను ప్రవేశపెట్టి అమలుచేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోతే గర్భిణులు, బాలింతలకు ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాలు, రాయలసీమ మధ్యాంధ్రాలోని కొన్ని మారుమూల గ్రామాల్లో నెట్ సిగ్నల్స్ లేక పోవడంతో ఎఫ్ఆర్ఎస్ అమలు చేయలేక అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని, ఆ ప్రాంతాల్లో ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేయాలని, 7 నెలలు నుండి 3 సం.లోపు పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ ఆలోచన విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి భారతి, యూనియన్ నాయకురాలు అబీద, సుజాత, సుబ్బలక్ష్మి, అనసూయ, ప్రభావతి, రెడ్డి రాధా తదితరులు పాల్గొన్నారు.

'నా భూమి-నా దేశం' విజయవంతం చేయాలి: జేసీ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈనెల 9 నుండి 25వ తేదీ వరకు నిర్వహించే 'నా భూమి-నా దేశం' 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమ విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు జిల్లా, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జగనన్నకు చెబుదాం- సివిల్ డిస్ప్యూట్స్ పరిష్కారానికి మండల, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీల ఏర్పాటుకు చర్యలు, స్పందన, మీ సేవా సంబంధింత అంశాలపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంఎ డిఓలు, ఇతర సంబంధింత అధికారులతో జెసి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం -వీరులకు వందనం కార్యక్రమం అన్ని గ్రామపంచాయతీలలో మండల ప్రధాన కార్యాలయాలలో పట్టణ ప్రాంతాలలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా అందిన సివిల్ డిస్ప్యూట్స్ ను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం మండల స్థాయిలో జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీల ఏర్పాటు ద్వారా పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో తహసిల్దారు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ (మునిసిపాలిటీ పరిధిలో) సబ్‌ఇన్స్పెక్టర్ సమన్వయ కమిటీగా ఉంటారని, జిల్లా స్థాయిలో జిల్లా జాయింట్ కలెక్టర్, అడిషనల్ ఎస్పీ డిపిఒ, మున్సిపల్ కమిషనర్, డిస్టిక్ రిజిస్టర్ కమిటీగా ఉంటుందని మండల స్థాయిలో అందిన సివిల్ డిస్పేట్స్‌కు సంబంధించి అర్జీదారులకు నోటీసు పంపి ఇరువర్గాలతో సమావేశం నిర్వహించాలని, మండల స్థాయిలో పరిష్కారం కానీ కేసులను జిల్లా స్థాయికి రెఫర్ చేయాలని తెలిపారు. ప్రతి వారంలో ఒక రోజు ఇందుకు కేటాయించి పని చేయాలనితెలిపారు.

టిడిపి నాయకుల అరెస్టులపై నిరసన


నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: పుంగనూరులో జరిగిన దాడి ఘటనకు సంబంధించి తెలుగుదేశం పార్టీ నేతలపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడాన్ని ఖండిస్తూ పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు శాంతియుతంగా సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్షాల గొంతును నొక్కడమే పనిగా పెట్టుకుని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని వైసీపీ ప్రభుత్వ నాయకులు అపహాస్యం చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులను ఎక్కడికక్కడ అణిచివేసేందుకు కుట్రలకు తెర లేపుతూ పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతిపై ప్రజలకు వివరించే ప్రతిపక్షాలకు అనుమతి లేదంటే ఎలాగని, ప్రజాస్వామ్య విరుద్ధంగా ప్రభుత్వ సంస్థలు పనిచేయడం మంచిది కాదన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అక్రమాలు, దౌర్జన్యాలు, అరాచకాలతో వైసీపీ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బీహార్‌ను మించి పోతుందని, ఇది భావితరాల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. చిత్తూరు జిల్లాలో రామచంద్రారెడ్డి ప్రోద్బలంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ఏ ఒక్క అమాయకుల పైనైనా అక్రమ కేసులు పెట్టిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలను పోలీసులు సైతం ప్రోత్సహించడం మంచిది కాదని హితవు పలికారు. ఇకనైనా అక్రమ కేసులు, అరెస్టులను పక్కనపెట్టి అభివద్ధి పై దష్టి సారించాలని, తిరిగి ఇలాంటివి పునరావతమైతే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో తామంతా ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లె, గంగవరం, పెద్ద పంజాణి, పలమనేరు రూరల్ పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, సోమశేఖర్ గౌడ్, ఆనంద్, నాగరాజు రెడ్డి, నాయకులు ఖాజాపీర్, గిరిబాబు, నాగరాజు, గణేష్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగాన్ని గౌరవించాలి



ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

ప్రజాశక్తి-నగరి: చేనేత రంగాన్ని గౌరవించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కళాశాలలో సాంస్కృతిక విభాగం వారు ఏర్పాటు చేసిన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారత దేశంలో వ్యవసాయం తరువాత అత్యధికంగా జనాభాకు ఉద్యోగ అవకాశాలు కల్పించే రంగం చేనేత అన్నారు. దీనిని కాపాడుకోవడం, గౌరవించుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యం అన్నారు. బ్రిటీష్ వారు భారతదేశంలో తీవ్రంగా దెబ్బతీసిన మొదటి వృత్తి చేనేత అన్నారు. వ్యవసాయం తరువాత రెండవ అతి పెద్ద ఉద్యోగ కల్పనా రంగమైన నేత పరిశ్రమను తమ ఎగుమతి, దిగుమతి విధానం ద్వారా బలహీనపరచడంతో కోట్లాది ప్రజలను పేదరికంలోకి నెట్టివేశారన్నారు. భారతదేశంలో నిరుద్యోగం లేకపోవడానికి, ఆర్థికంగా, పరిపుష్టిగా, స్వయం పోషకంగా ఉండటానికి కారణం చేనేత రంగమన్నారు. విద్యార్థులు చేనేత వస్తులకు గత వైభవం వచ్చేలా, ప్రపంచం మెచ్చేలా చేయాలనీ పిలుపునిచ్చారు. చేనేత రంగంలో భారతీయుల నైపుణ్యం ప్రపంచం గర్వించదగిన స్థాయిలో ఉందన్నారు. అగ్గిపెట్టెలో ఇమిడిపోయే చీరను ఇప్పటికీ చెప్పుకోవడం మనం వింటూ ఉంటామని, శిల్పాలపై కూడా ఈ కళను సూచించే శిల్పాలను చెక్కారని, కావున ఈ కళను, వత్తిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వం, చేనేత వస్త్రాలను ధరించిన వారితో ఫ్యాషన్ షో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. భాస్కర రాజు, కళాశాల సాంస్కృతిక విభాగం కో ఆర్డినేటర్ డా. అరుణ కుమారి, అధ్యాపకులు డా.స్వాతి, డా.శ్రీలక్ష్మి, డా.పంకజ, డా.రేవతి, డా.రెడ్డి నాయక్, డా.మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని మాంగాడు గ్రామంలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత కార్మికులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. చేనేత కార్మిక యూనియన్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు కెవి కుప్పయ్య మాట్లాడుతూ 2015 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు జి.గోపాల్, కందల గేరటయ్య శెట్టి, కే వెంకట రత్నం శెట్టి, ఏ సంజీవి, బి శేఖర్, బి శ్రీనివాసులు, కే సుధాకర్, బి లక్ష్మీపతి, ఎన్ మోహన్, కే జానకి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన



నగరిలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం లయన్స్ క్లబ్ వారు పీఈఎస్ ఆసుపత్రి సౌజన్యంతో గుడిపల్లిలోని రాళ్ల గంగమాంబ ఆలయం వద్ద గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టిన బిడ్డలకు తల్లి పాలు ఎంత అవసరమో, దాని వలన కలుగు ప్రయోజనాలను వివరిస్తూ పీఈఎస్ ఆసుపత్రి విద్యార్థులు నాటికను ప్రదర్శించి కార్యక్రమానికి వచ్చిన మహిళలకు అవగాహన కల్పించారు. పీఈఎస్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.హరిచంద్ర మాట్లాడుతూ మూఢనమ్మకాలతో తల్లి బిడ్డలకు పాలు ఇవ్వకపోవడం వలన కలుగు నష్టాలను వివరిస్తూ, అదేవిధంగా తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ గంగాధర్, లయన్స్ క్లబ్ జోనల్ ఛైర్ పర్సన్ డా. ఎ.మహేష్, కోశాధికారి పీజీ సెల్వం, క్లబ్ డైరెక్టర్లు శివకుమార్, లెనిన్, సుబ్రహ్మణ్యం, మతిన్, వెలుగు సంఘం సిసి వెంకటా చలపతి, సంఘమిత్ర రత్నశీల, వెలుగు సంఘాల మహిళలు పాల్గొన్నారు.


గుడిపల్లిలో..

నగరి: స్థానిక ఇందిరానగర్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు నేటితో ముగిసినట్లు హెల్త్ సూపర్‌వైజర్ డి.చింతామణి సోమవారం తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు మీనా, సలీమా, బాలింతలు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి


టీకా వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రామకుప్పం: గ్రామాల్లో చిన్నపిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని విజలాపురం ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. సోమవారం మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం ప్రాథమిక ఆసుపత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా పురిటి బిడ్డల నుంచి ఐదు సంవత్సరాలలోపు ఉన్న శిశువులకు ప్రభుత్వ ఆసుపత్రిలో టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచనలు, సలహాలు అందజేశారు. విజలాపురం పరిధిలోని గ్రామాల్లోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాదియా, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కళలను గౌరవించాలి


ప్రశంసా పత్రాలతో కళాకారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని రాష్ట్ర జానపద కళాకారుల సంఘ ప్రధాన కార్యదర్శి బంగారు మురళి అన్నారు. సోమవారం మండలంలోని కల్లూరు పల్లి పంచాయతీ కోరివి వారిపల్లి గ్రామంలో కళాతరం నిర్వహించిన జానపద కళల పోటీల్లో కొరివివారిపల్లికి చెందిన మహిళా గ్రూపు సభ్యుల కోలాటాలు మొదటి బహుమతి కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బంగారు మురళి మాట్లాడుతూ గ్రామీణ కళలు అంతరించిపోతున్న సందర్భంలో గ్రామంలో ప్రాచీన కళలను అలవర్చుకుంటున్నారని, ప్రస్తుతం ఉన్న సాంకేతికతలో ప్రాచీన కళలను గుర్తించడం వార్షించదగ్గ విషయమన్నారు. అన్ని గ్రామీణ కళల్లో పాల్గొనాలని, చెక్కభజన, కోలాటాలు, పండరి భజన గ్రూపులుగా ఏర్పడి మన పరిసరాల్లోని ఆలయాల్లో, సముదాయాల్లో ప్రదర్శనలకు వెళ్లాలన్న కలలను తల్లిలా గౌరవించాలని అన్నారు. అనంతరం గెలిచిన వారికి ప్రశంసా పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, కళాతరంగని సంఘ వ్యవస్థాపకులు రాజేష్ బాబు, జిల్లా కోఆర్డినేటర్ మస్తాన్, జిల్లా కళాకారుల సంఘ అధ్యక్షులు రామచంద్ర, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి రాజేంద్రనాయుడు, సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో చింత మొక్కలు


ఉద్యాన శాఖ అధికారి సంతోషి కుమారి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఉద్యానశాఖ వద్ద అంటుకట్టిన చింతమొక్కలు రైతుల కోసం అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి సమీపంలోని నర్సరీ నుండి పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారిణి సంతోషి కుమారి సోమవారం తెలిపారు.

న్యాయం చేయండి



మాట్లాడుతున్న బాధితుడు చంద్రశేఖర్‌నాయుడు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: అనసరంగా భూవివాదం సృష్టిస్తూ అక్రమకేసులు పెడుతున్నారని తమకు న్యాయం చేయాలంటూ చిత్తూరు రూరల్ మండలం వరదరాజులపల్లికి చెందిన చంద్రశేఖర్ నాయుడు సోమవారం విలేకరులను ఆశ్రయించారు. విలేకరుల సమావేశంలో బాధితుడు చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ తమకు 1940లో ప్రభుత్వం మంజూరు చేసిన రెండు ఎకరాల స్థలం కాజేసేందుకు అదే గ్రామానికి చెందిన కొందరు రెవెన్యూ, పోలీసులతో తమపై అక్రమకేసులు పెడుతున్నట్లు వాపోయారు. కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వచ్చినా తమపై అక్రమకేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయారు. జిల్లా రెవెన్యూ అధికారులు కల్పించుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ మృతి


మృతి చెందిన కేయం బాలరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్, రాష్ట్ర స్థాయి నాటక రంగ అవార్డు గ్రహీత కేయం బాలరాజు మృతి చెందారు. సోమవారం ఆయన ద్విచక్రవాహనంలో చిత్తూరు నగరంలోని మురుకంబట్టు బైపాస్ రోడ్‌లోని ఇంద్రమ్మ కాలనీ హెూండా షోరూం వద్ద వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే 108 వాహనంలో స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈయన చిత్తూరు ప్రభుత్వ కన్న జూనియర్ కళాశాలలో, ఐరాల జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఈయన ప్రముఖ రచయిత, కళాకారుడు, చిత్రకారుడు, నటుడుగా, చిత్తూరు జిల్లా, రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

ఆర్ఎంపీ డాక్టర్...


ప్రభాకర్ రెడ్డి (పాతచిత్రం)

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఆర్ఎంపీ డాక్టర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. బంగారుపాళ్యానికి చెందిన ప్రభాకర్ రెడ్డి (75) ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో అకస్మాత్తుగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు బంగారుపాళ్యం అరగొండ రోడ్‌లో గత 40 సంవత్సరాలుగా ఆర్ఎంపి వైద్యం చేస్తుండేవాడు. ఆయన మృతికి రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, మండల ప్రజలు సంతాపం తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం




కాలువలో పడిన పాఠశాల బస్సు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని ఉషోదయ పాఠశాల మినీ బస్సు బోడపండ్ల గ్రామం నుండి బంగారుపాళ్యానికి సోమవారం విద్యార్థులను తరలిస్తూ వాహనం మరమ్మత్తులకు లోనై పక్కనే ఉన్న కాలవలోకి ఒరిగిపోయింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న ఏడు మంది విద్యార్థులలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని, పాఠశాలలు ప్రారంభించే ముందు వాహనాలను తనిఖీ చేయాల్సిన రోడ్డు రవాణా సంస్థ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో కండీషన్‌లేని వాహనాలు రోడ్డుపై ప్రయాణిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు వాహనాలను తనిఖీ చేసేటప్పుడు పూర్తిస్థాయి కండీషన్ నిర్ధారణ అయిన తర్వాత రోడ్డుపైకి వాహనాలను పంపాలని వారు కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ నాగరాజు రావు తెలిపారు.

ఘనంగా ఆరోగ్యశ్రీ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-సోమల: ఆరోగ్యశ్రీ పథకాన్ని 2004వ సంవత్సరం ఆగస్టు 7వ తేది ప్రారంభించిన దినోత్సవం సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య శ్రీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ చేసిన ఉద్యమాల ఫలితంగా నాడు అసెంబ్లీలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలకు ఎన్నో వైద్య సేవలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లా యువ జన విభాగ అధ్యక్షులు మాటూరు మురళి, డివిజన్ ప్రధాన కార్యదర్శి మంద రామనాథం, యువజన విభాగ అధ్యక్షులు శుభకర్, బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వేణు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని బంగారు తిరుత్తణి కొండ వద్ద ఆడికత్తిక మహోత్సవాలలో భాగంగా మండలంలోని కందూరు, సోమల ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలువురికి వైద్య సేవలను అందజేశారు. కార్యక్రమంలో కందూరు ఎంపీహెచ్ఈఓ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ బాలాజీ, ఎంఎల్‌హెచ్‌పి శశి కుమార్, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఒకటి నుండి 19సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో డిఐఓ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ గోవర్ధన్‌లతో కలసి జాతీయ నులిపురుగుల గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలను పాఠశాలల్లోని పిల్లలతో పాటుగా పాఠశాల బయట ఉన్న పిల్లలందరికీ 10వ తేదీన మధ్యాహ్నం భోజనం తిన్నా తర్వాత మాత్రలు వేసే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సిఈఓ ప్రభాకర్ రెడ్డి, ఎన్నికల విభాగం నుండి బ్యుల, డిఎస్ఏ.మధు, డాక్టర్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇష్టమొచ్చిన వారికి రుణాలు మంజూరు చేయడంతో పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తుంబకుప్పం సంఘమిత్ర జాంభవిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం డ్వాక్రా మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తుంబకుప్పం సంఘమిత్ర అర్హులైనవారికి స్త్రీనిధి రుణాలు మంజూరు చేయకపోవగా ప్రశ్నించిన వారిపై దుర్భాలాడుతూ సంఘం నుండీ తొలగిస్తానంటూ బెదిరిస్తోందన్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసిన కారణంగా తమపై దాడులు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయం సహాయ సంఘాల డబ్బులను స్వాహా చేయడంతో పాటు అనుచితంగా ప్రవర్తిస్తున్న సంఘమిత్రపై చర్యలు తీసుకోవాలని కోరారు.


నిరసన వ్యక్తం చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు